

కొత్త ఊళ్లో.. ఎట్ల బతుకుడు?
కవ్వాల్ టైగర్ జోన్‌లోని రాంపూర్, మైసంపేట్ వాసులు పులి మనుగడ కోసం ఊళ్లను ఖాళీ చేశారు. వీరికి ఇచ్చిన భూములను ఇప్పటికీ సిద్ధం చేయలేదు. 8లో▸



నలుగురు దోపిడీ దొంగల అరెస్టు
జల్సాలకు అలవాటుపడి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.3/31.6
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఇచ్చోడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని గిరిజన నిరుద్యోగులకు ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్, ప్లంబింగ్, శానిటేషన్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐకేపీ జేపీఎం ముకుంద్‌రావు తెలిపారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆదేశాల మేరకు బెల్లంపల్లిలోని వైటీసీలో శిక్షణ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారికి 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలని, పదో తరగతి పాసై ఐటీఐ, డిప్లొమా ఎలక్ట్రానిక్స్ చేసిన వారై ఉండాలన్నారు. ఆసక్తి గలవారు జూన్ 5న సాయంత్రం 6 గంటల లోపు బెల్లంపల్లి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు యూనిఫాం సకాలంలో అందించాలి



వస్త్రం అందజేస్తున్న డీఎల్‌పీవో

నార్నూర్ : పాఠశాల ప్రారంభంలోనే విద్యార్థులకు యూనిఫాం అందించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు యూనిఫాం కుట్టేందుకు వస్త్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆశన్న, ఏపీఎం మాధవి, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 'బడిబాట'

కైలాస్‌నగర్: బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు, టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు అన్ని పాఠశాలల పరిధిలో నిర్వహించనున్న బడిబాట కార్యక్రమంపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల క్రియాశీల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో డీఈవో టి .ప్రణీత, డీఆర్‌డీవో సాయన్న, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ వార్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీగణ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆవరణలో మూతబడిన టీబీ వార్డును పునరుద్ధరించాలని డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర కన్సల్టెంట్ శ్రీగణ అన్నారు. గురువారం రిమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో టీబీ అధికారులు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ నియంత్రణకు వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన వసతులు కల్పించి రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలన్నారు. టీబీ వార్డులో సెక్యూరిటీ గార్డు, పేషెంట్ కేర్‌లను నియమించడంతో పాటు ఆక్సిజన్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో రిమ్స్ వైద్యులు సందీప్ జాదవ్, రమేశ్ పవార్ పాల్గొన్నారు.



విత్తన దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

తీరు మారలే..

- మూడోరోజూ వందలాది మంది రైతులకు దొరకని పత్తి విత్తనాలు
- మండుటెండల్లో గంటల తరబడి నిరీక్షణ
- నోస్టాక్ బోర్డు పెట్టడంతో ఆగ్రహం
- డీలర్ల తీరును నిరసిస్తూ రోడ్డెక్కి ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: అన్నదాతలకు పత్తి విత్తన కష్టాలు తప్పడం లేదు. మూడో రోజు సైతం జిల్లా కేంద్రంలో అదే సీన్ రిపీట్ అయ్యింది. ఉదయం 6 గంటలకే జిల్లా నలుమూలల నుంచి రైతులు విత్తనాల కోసం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకున్నారు. మండుటెండల్లో విత్తన దుకాణాల ముందు పడిగాపులు కాశారు. క్యూలైన్‌లో అష్టకష్టాలు పడ్డారు. తమవంతు వచ్చేసరికి డీలర్లు నోస్టాక్ బోర్డు పెట్టడంతో ఆగ్రహానికి గురయ్యారు. తమకు విత్తనాలు పంపిణీ చేసి తీరాల్సిందేనంటూ డీలర్లతో వాగ్వివాదానికి దిగారు. డీలర్లు విత్తనాల స్టాక్ లేదని చెప్పడంతో రైతులు జిల్లా కేంద్రంలోని కిసాన్‌చౌక్ వద్ద రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పినప్పటికీ ససేమిరా అన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు తెప్పించి అందజేస్తామని చెప్పడంతో శాంతించారు.

మ్యాక్స్ వాహనాన్ని అడ్డుకున్న రైతులు

ఓవైపు నోస్టాక్ బోర్డు పెట్టిన డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా విత్తనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులు మండిపడ్డారు. పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలోని ఓ విత్తన దుకాణం వద్దకు ఉదయం 6 గంటలకే అన్నదాతలు వందలాది సంఖ్యలో చేరుకున్నారు. ఆ షాపు యజమాని ఉదయం 7.30 గంటల ప్రాంతంలో దుకాణం తెరిచాడు. ఆ డీలర్ వద్ద విత్తనాలు ఉన్నాయని తెలుసుకున్న రైతులు అక్కడికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా డీలర్ నోస్టాక్ బోర్డు పెట్టడంతో ఆందోళనకు దిగారు. సమీపంలోని కిసాన్ చౌక్‌లో గల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతోపాటు ఓ మ్యాక్స్ వాహనంలో విత్తనాలను ఇచ్చోడ ప్రాంతానికి తరలిస్తుండగా అడ్డుకున్నారు. డీలర్ వ్యవహార శైలిపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు పంపిణీ చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



విత్తనాలు తరలిస్తున్న మ్యాక్స్ వాహనాన్ని అడ్డుకున్న రైతులు

పుల్లయ్య, డీఎస్పీ జీవన్‌రెడ్డి మ్యాక్స్ వాహనంలో ఉన్న విత్తనాలు పరిశీలించారు. అయితే బిల్లులు ఈ నెల 29వ తేదికి సంబంధించినవి ఉండడంతో మతలబు ఏమిటని ప్రశ్నించారు. విత్తనాల తరలింపుపై చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. రూ.6లక్షల విలువ చేసే విత్తనాల తరలింపు వ్యవహారంపై విచారణ చేపడతామని డీఎస్పీ పేర్కొన్నారు. వాహనాన్ని టూటౌన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న రైతు సంఘాల నాయకులు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని దీనిపై ఆరా తీశారు.

మూడో రోజు అవే తిప్పలు..
విత్తనాల కొనుగోలు కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మూడో రోజు గురువారం సైతం అదే సీన్ రిపీట్ అయ్యింది. ఉదయం 6 గంటలకే ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల రైతులతో పాటు ఇతర మండలాలకు చెందిన అన్నదాతలు జిల్లా కేంద్రానికి వచ్చి గంటల తరబడి దుకాణాల ముందు క్యూలో నిలబడుతున్నారు. వారి కుటుంబ సభ్యులను సైతం నిలబెడుతున్నారు. తీరా విత్తనాలు లభించకపోవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెబుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో తమకష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయిలో డిమాండ్ రకం విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఏవో పుల్లయ్య పేర్కొన్నారు.

జెడ్పీలో ఉగ్గబట్టుకోవాల్సిందే?



బేస్‌మెంట్ దశలోనే ఆగిన నిర్మాణ పనులు

- ఒంటికీ, రెంటికీ ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, సిబ్బంది
- ఉన్న మరుగుదొడ్లు కూల్చారు... కొత్తవి కట్టడం ఆపారు
- అత్యవసరమైతే బయటకు వెళ్లాల్సిందే..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఒంటికి, రెంటికి తీవ్ర పరేషాన్ అవుతున్నారు. కార్యాలయంలో ఇదివరకు ఉన్న మరుగుదొడ్లను కూల్చివేసి కొత్తవి నిర్మించేందుకు చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటికీ, రెంటికీ బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితుల్లో వారు అవస్థల పాలవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రేక్షకపాత్ర పోషించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నామినేషన్ ప్రాతిపదికన పనులు
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపరిషత్‌గా ఉన్న సమయంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోసం పాత సమావేశ మందిరాన్ని ఆనుకుని మరుగుదొడ్లు నిర్మించారు. ఏళ్లుగా వాటినే వినియోగిస్తూ వస్తున్నారు. అయితే అవి శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని సంకల్పించారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. టెండర్ల ప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉండగా రెండుబిట్లుగా విడదీసి వీటి నిర్మాణ పనులను నామినేషన్ పద్ధతిలో ఓ ప్రజాప్రతినిధికి సన్నిహితుడిగా ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పాత మరుగుదొడ్లను పూర్తిగా కూల్చివేసి పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేశారు. ఇటుక, ఇసుక, తదితర నిర్మాణ సామగ్రి సైతం తెప్పించి సిద్ధంగా ఉంచారు. ఆతర్వాత ఏమైందో తెలియదు కానీ సదరు ప్రజాప్రతినిధి పనులను నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. సదరు ఆదేశాలతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో పాటు నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లుగా సదరు ప్రజాప్రతినిధికి వెల్లడించినట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

ఉద్యోగుల అవస్థలు
మరుగుదొడ్లను కూల్చివేసి ఐదు నెలలు గడుస్తోంది. కొత్త వాటి నిర్మాణ పనులు జరగకపోవడంతో జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఒంటికీ, రెంటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారే కాదు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారికి కూడా అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగుల అవస్థలు వర్ణణాతీతం. రెగ్యులర్‌గా పనులు కొనసాగితే ఇప్పటికి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చేవని అభిప్రాయపడుతున్నారు. కానీ అర్ధంతరంగా పనులను నిలిపివేయడం, వాటి బాధ్యతలను మరే ఇతర వ్యక్తులకు అప్పగించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ఉద్యోగులు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై జెడ్పీ సీఈవో రత్నమాలను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె స్పందించలేదు.

'గ్రూప్–1 ప్రిలిమినరీ'కి పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా
- పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం

కైలాస్‌నగర్: జూన్ 9న నిర్వహించనున్న తెలంగాణా స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ గౌస్ ఆలం, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6,729 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా 18 కేంద్రాలు, రీజనల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఐదుగురు రూట్ ఆఫీసర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు ఉదయం 9 గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 9:30 గంటలకు బయోమెట్రిక్ హాజరు మొదలవుతుందన్నారు. 144 సెక్షన్ అమలు, స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటీ, పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలన్నారు. సెల్‌ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువులను లోనికి అనుమతించవద్దన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

కైలాస్‌నగర్: నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే వారిపై పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పత్తి విత్తనాల విక్రయాలపై సంబంధిత అధికా రులతో గురువారం రాత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ద్వారా ధృవీకరించబడిన 55 కంపెనీలకు సంబంధించి హైబ్రిడ్ రకాలు 128, రాశి సీడ్స్‌కు సంబంధించి 5 రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధికారుల సమన్వయంతో జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అన్నిచెక్ పోస్టులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో తనిఖీ చే యాలన్నారు. ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఏడీఏ రమేశ్, ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కై లాస్‌నగర్: అటవీ భూములను ఆక్రమించినా స్మగ్లింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అటవీ సంరక్షణ, స్మగ్లింగ్ కట్టడికి చేపడుతున్న చర్యలపై అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైతే అలాంటి వారిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. పంటచేలచుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే అటవీ జంతువులు మరణించే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. రోడ్లు, ఇతర నిర్మాణాలకు అటవీ భూములు అవసరమైతే ఎఫ్‌సీఏలో దరఖాస్తు చేసుకుని అనమతులు లభించాకే పనులు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ భూములు, ఇంటి పరిసరాలు, రోడ్లు, విద్యుత్ తీగల కింది చెట్లను నరికితే వాల్టా చట్టం ప్రకారం బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలం, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, ఆర్ అండ్‌బీ ఈఈ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే శంకర్



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చనాకా–కోర్ట ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు సంబంధించిన రూ.94 కోట్ల పరిహారం నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల కాక పనులు నిలిచిపోయాయని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో భూ సేకరణ కింద బాధితులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.27 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని విన్నవించారు. జిల్లాలో పత్తి రైతులకు అవసరమయ్యే విత్తనాలు దొరక్క రోడ్లపై పడిగాపులు కాస్తున్నారని, నకిలీ విత్తనాల బెడదను అరికట్టి రైతుల డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాల పంపిణీ జరిగేలా చూడాలని కోరారు. సీఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు కూడా వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్‌కు బాటలు

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: క్రీడలతో యువత బంగారు భవిష్యత్‌కు బాటలు పడుతాయని గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి ఉట్నూర్ కేబీ ప్రాంగణ మైదానంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన పాటిస్తే తప్పకుండా రాణిస్తారన్నారు. పట్టుదలతో ఆడితే ఉన్నత స్థితికి చేరుకుంటామన్నారు. ఈ ఏడాది ఉట్నూర్‌లోనే రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ఉంటాయని, అందులో చాంపియన్ షిప్ సాధించేలా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను



మాట్లాడుతున్న డీడీ దిలీప్‌కుమార్

నిరంతరం సాధన చేసి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇన్ఫోసిస్ సంస్థను సందర్శించేందుకు వెళ్తున్న గిరిజన విద్యార్థులకు గుర్తింపు కోర్టులు, ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. జాతీయ పతాక విజేత మడావి ప్రశాంత్‌ను సన్మానించారు. జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతి కుమార్, ఏఎస్‌వో హేమంత్, మధుసూదన్, రవీందర్, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, శేఖర్, మనోజ్ పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధికారి

ఆదిలాబాద్‌రూరల్: గతంలో వివిధ పోటీ పరీక్షల్లో రాణించిన వారిని ఆదర్శంగా తీసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అభ్యర్థులు ప్రణాళికతో ముందుకెళ్లాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం కలిగిన ఫ్యాకల్టీతో అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీ



మాట్లాడుతున్న డీడీఎంహెచ్ఓ సాధన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన గురువారం తనిఖీ చేశారు. మోచిగల్లిలోని గైనిక్ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి పీసీపీ ఎన్‌డీటీ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించిన సూచనలు జారీ చేశారు. ఆమె వెంట మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, వైద్యాధికారి అశోక్, తదితరులు ఉన్నారు.

విత్తన డీలర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: రైతులను ఇబ్బందులకు గురిచేసిన విత్తన డీలర్‌పై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలోని నిఖిల్ ఫర్టిలైజర్ షాపు యజమాని రాకేష్ రెడ్డిపై ఆదిలాబాద్‌అర్బన్ వ్యవసాయ శాఖ అధికారి రమేశ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. షాపులో రాశి 659 సీడ్స్ ప్యాకెట్లు ఉన్నప్పటికీ నోస్టాక్ బోర్డు పెట్టి మ్యాక్స్ వాహనంలో ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి చిలుక పొచ్చన్న నివాసంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పొచ్చన్న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అనంతరం లోనికి వెళ్లి చూడగా 8 తులాల బంగారు, 9 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.5వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆదిలాబాద్ పట్టణంలో..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరాం కాలనీలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఆశన్న రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లి గురువారం తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం, బీరువాలోని రూ.5వేల నగదు, ఒక గ్రాము బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ తీగపడి ఎద్దు మృతి

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామ సమీపంలోని మామిడి తోటలో గురువారం విద్యుత్ వైరు తెగి పడి ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన చేగోండ నారాయణకు చెందిన ఎద్దు మేత కోసం తోటకు వెళ్తుండగా అకస్మాత్తుగా తీగ తెగిపోయి ఎద్దుపై పడింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కొత్త ఊళ్లో.. ఎట్ల బతుకుడు?



రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీ

- ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు
- సాగుకు యోగ్యంగా లేని భూముల కేటాయింపు
- సాగుకు సిద్ధం చేస్తామన్న హామీ మరిచిన వైనం..
- పరిహారం ఇవ్వాలంటున్న పునరావాస గ్రామస్తులు

కడెం: కవ్వాల్ టైగర్ జోన్‌లోని రాంపూర్, మైసంపేట్ వాసులు పులి మనుగడ కోసం ఊళ్లను ఖాళీ చేశారు. మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీకి వచ్చిన గ్రామస్తులకు అటవీ శాఖ ఇళ్లు, వ్యవసాయ భూమి అప్పగించింది. అయితే వ్యవసాయ భూమి పంటల సాగుకు యోగ్యంగా లేదు. వానాకాల సీజన్ సమీపిస్తున్నా భూములు సాగు చేసే పరిస్థితి లేదు. ఇళ్లు, భూమి వదిలి గ్రామలను ఖాళీ చేసి వచ్చిన తాము కొత్త ఊళ్లో ఎలా బతకాలని పునరావాస గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సిద్ధం కానీ సాగుభూమి

రాంపూర్, మైసంపేట్ గ్రామల్లోని 94 కుటుంబాలకు ప్యాకేజీలో భాగంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 2.32 ఎకరాల వ్యవసాయ భూమి అప్పగించారు. పునరావాసకాలనీ కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేయగా.. వ్యవసాయ భూమి మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధి పెత్తర్పు సమీపంలో అప్పగించారు. ఒక్కో కుటుంబానికి 2.32 ఎకరాల చొప్పున హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. అయితే ఆ భూమిని చదును లేకపోవడం, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం, సాగు నీటి వసతి లేకపోవడంతో పంటలు వేసే పరిస్థితి లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా భూమి చదును చేయడం లేదని పేర్కొంటున్నారు. భూమిని సాగుకు సిద్ధం చేసే వరకూ తమకు పరిహారం చెల్లించాలని పునరావాస గ్రామాల గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొంత కాలంగా ఆ వ్యవసాయ భూమి తమకే దక్కాలని ఆందోళన చేస్తున్న నచ్చన్‌ఎల్లాపూర్ గొండుగూడ వాసులు ఇటీవలే వ్యవసాయ భూమి హద్దురాళ్లు విరగొట్టారు.



పెత్తర్పు సమీపంలో వ్యవసాయ భూమి

భూమి కాడ లొల్లి



మాకు ఇచ్చిన భూమిలోకి పోతే మా భూమి అని పక్క గూడెపోల్లు లొల్లి జేస్తుంత్రు. కని బండలు ఇరగొడుతున్నరు. పీకి పారేస్తున్నారు. రాళ్ల రప్పలు ఉన్న భూమి ఇస్తే పంటలు ఎట్ల పండించాలె. మేమెట్ల బతకాలె.

– గాదె బుచ్చవ్వ

పరిహారం ఇవ్వాలి



అన్నీ సిద్ధం చేశాకే ఊళ్లు ఖాళీ చేయిస్తామన్న అధికారులు హడావుడిగా తరలించారు. ఇక్కడ చేసుకోవడానికి పని లేదు. భూమి చదును, త్రీఫేజ్ విద్యుత్, నీటి సౌకర్యం కల్పించే వరకు పరిహారం చెల్లించాలి.

– ప్రవీణ్

ఆందోళన చెందొద్దు



పునరావాస గ్రామస్తులకు కేటాయించిన వ్యవసాయ భూమి పట్టాలు ప్రింట్ అవుతున్నాయి. డీఆర్డీవో, ఐటీడీఏ నుంచి బావుల తవ్వకం, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భూమి చదును, రాళ్ల తొలగింపు అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– అనిత, ఎఫ్ఆర్వో, కడెం

అమెరికా సభల్లో ఖానాపూర్ యువకుడి ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న జనార్దన్ కుమారుడు

ఖానాపూర్: తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభలను అమెరికాలోని సియాటిల్ మహా నగరంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 10 వేల మందికిపైగా హాజరైన ఈ సభలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ప్రతిభాపోటీలు, ఫ్యాషన్‌షో, వాక్ కాంపిటీషన్ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బిగ్‌బాస్ విన్నర్ కౌశల్ మండ, అశ్విని, యాక్టర్ మెహ్రీన్ వ్యవహరించారు. ఇందులో ఖానాపూర్ మండలం సింగాపూర్ గ్రామానికి చెందిన మహాసభల నిర్వాహకుడు పన్నెల జనార్దన్ పాల్గొన్నారు. జనార్దన్ కుమారుడు విఖ్యాత్ రాణా సైతం పోటీల్లో పాల్గొని అత్యధిక మార్కులు సాధించడంతోపాటు మిస్టర్ టీన్ విభాగంలో విన్నర్‌గా నిలిచాడు. అట్లాంటా నగరంలోని సభల్లో ప్రవాస భారతీయుడు ప్రతిభ కనబర్చడాన్ని పలువురు అభినందించారు.

అంతర్జాతీయ కర్రసాములో ప్రతిభ



కర్రసాములో ప్రతిభ కనబర్చిన యువకుడు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన బోసు సుమ–నర్సయ్య దంపతులకు మారుడు సంతోష్ మలేసియాలోని సెపాంగ్‌లో ఈనెల 28న జరిగిన కర్రసాము పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. నెల క్రితం చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మలేసియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ కర్రసాము పోటీల్లోని కుతువరసాయి విభాగంలో రెండోస్థానంలో నిలిచాడు. ఇంటర్నేషనల్ టెక్నికల్ కమిటీ చైర్మన్ మాస్టర్ చంద్రన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు.

హార్టికల్చర్ అకౌంటెంట్ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దెబ్బటివార్ సంజీవ్ కుమార్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. రైతుల బిందుసేద్యం పరికరాలకు సంబంధించిన డీడీలను తన సొంతఖాతాలోకి మళ్లించుకున్నాడని మార్చి 7న జిల్లా హార్టికల్చర్ అధికారిగా పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశారు. రూ.కోటి 79 లక్షల 88,832 కాజేసినట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.2లక్షల నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

బాసరలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

భైంసాటౌన్: వేసవి సెలవులు త్వరలో ముగియనుండడంతో బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. గురువారం అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్న భక్తులు తర్వాత చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు.

ఓర్వలేకనే విత్తన కొరత రాజకీయం

- కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలనను ఓర్వలేకనే బీఆర్ఎస్, బీజేపీ విత్తన కొరత పేరిట రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఒకే రకం విత్తనాలు కోరుకుంటుండటంతో దుకాణాల వద్ద రద్దీ ఎక్కువైందన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా పోలీసులు వారిని క్యూలో నిలబెడితూ లాఠీచార్జి చేసారని విపక్షాలు ఆరోపించడం దుర్మార్గమన్నారు. ప్రజల మద్దతును చెడగొట్టేందుకే ఆ రెండు పార్టీలు రైతులను తప్పుదోవ పట్టించి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక దందాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల తనయులే అక్రమార్కుల్లా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులు అధైర్యపడవద్దని, వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి అదనంగా పత్తి విత్తన ప్యాకెట్లు తెప్పిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు నగేష్, సాయిచరణ్ గౌడ్, శ్రీలేఖ, భోజారెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు దోపిడీ దొంగల అరెస్టు

- సినీ ఫక్కీలో బాధితుడినే దొంగగా చిత్రీకరించిన కేటుగాళ్లు
- నిందితుల నుంచి కారు, ఆటో, నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ గౌస్ ఆలం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన మిర్జా ముషరఫ్, షేక్ బిలాల్, గబ్బె అక్షయ్, జైనథ్ మండలంలోని రామాయి గ్రామానికి చెందిన మెస్రం దత్తు గంజాయి మాదకద్రవ్యాలకు అలవాటుపడి డబ్బుల కోసం హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, వాహనాల చోరీకి పాల్పడుతున్నారు. ఈ నెల 25న ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో గల ఓ బార్ వద్ద ఓ అమాయకుడి వద్ద డబ్బులు ఉన్నాయని గ్రహించి ఆటో డ్రైవర్ సహాయంతో బాధితుడినే దొంగగా చిత్రీకరించారు. ఆటోలో కూర్పోబెట్టి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్తామని నటిస్తూ ప్రజలకు అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. బాధితుడు రాకపోయేసరికి అతనిపై దాడికి పాల్పడి రూ.10వేల నగదు లాక్కెళ్లగా ఈ దృశ్యాలన్నీ సీసీపుటేజీలో రికార్డయ్యాయి. ఈనెల 13న రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నోరు నొక్కి బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. సెల్‌ఫోన్, డబ్బులు లాక్కున్నారు. మహారాష్ట్ర వైపు తీసుకెళ్తూ మార్గమధ్యలో ఉండం వద్ద వాహనం ఆపడంతో అక్కడి నుంచి సదరు వ్యక్తి తప్పించుకున్నాడు. గతంలో తాంసి మండలం వడ్డాడి ప్రాజెక్ట్ వద్ద ఓ బాలున్ని కిడ్నాప్ చేసి ప్రాజెక్టులో పడేసి హత్యకు పాలపడ్డారు. బైక్‌ను విక్రయించారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న మిర్జా ముషరఫ్, ఏ–2గా ఉన్న షేక్ బిలాల్‌లపై దాదాపు 20 కేసుల వరకు నమోదయ్యాయి. నిందితుల వద్దనుంచి స్విఫ్ట్ కారు, ఆటో, సెల్‌ఫోన్‌తో పాటు రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కాగా దొంగలించిన సెల్‌ఫోన్‌ను ఆదిలాబాద్‌లోని మొబైల్ షాప్‌లో విక్రయించగా యజమాని జాహిద్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. చోరీలకు గురైన ఫోన్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని సూచించారు. దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బంది రమేశ్, నరేష్, క్రాంతి, నరేందర్, సుధాకర్‌రెడ్డిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద్‌పూర్ పెన్‌గంగలో రైడ్

- ఇసుక తవ్వకాలకు ఉపయోగించే పరికరాలు సీజ్



జైనథ్‌లో సీజ్ చేసిన పరికరాలతో అధికారులు

జైనథ్/బేల: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామ సమీపంలోని పెన్‌గంగలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఎస్సై పురుషోత్తం, ఆర్ఐ నితిన్, మైనింగ్ టీఏ రమేశ్ నదిలో దిగి ఇసుక తవ్వకాలను పరిశీలించారు. తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న పరికరాలను సీజ్ చేసారు. నది మధ్యలో ఇసుక తవ్వకాలకు వాడే భారీ బోట్ ఉండటంతో దాని కనెక్షన్ తొలగించారు.

విత్తన గోదాముల్లో తనిఖీలు



ఆదిలాబాద్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పత్తి విత్తన గోదాములను గురువారం రాత్రి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెట్ ప్రాంతం వెనుకాల గల పలు గోదాముల్లో డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, టూటౌన్ సీఐ అశోక్, ఆదిలాబాద్‌అర్బన్ వ్యవసాయ అధికారి రమేశ్ స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్చోడ: మండలంలో గురువారం తహసీల్దార్ తుకారాం, ఏవో కైలాస్, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పలు గోదాములను తనిఖీ చేశారు. నవత, రాయల్, ట్రాన్స్‌పోర్టులతో పాటు ఫర్టిలైజర్ గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. వారి వెంట ఏఈవోలు ఉదయ్‌కిరణ్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

మల్కుపల్లిలో ‘మెస్రం’ కోడళ్ల భేటీ



భేటీలో పాల్గొన్న మెస్రం వంశ కోడళ్లు

తాంసి: తలమడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కుపల్లిలో గురువారం సంప్రదాయబద్ధంగా మెస్రం వంశీయుల కొత్త కోడళ్ల భేటీ నిర్వహించారు. 260 నూతన జంటలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి 96 గ్రామాల మెస్రం వంశీయులు పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో (పెర్సపేన్) కార్యనిర్వాహక అధ్యక్షులు మెస్రం సంతోష్, కటోడల్ మెస్రం శంకర్, పేన్ పటేల్, మెస్రం మారు, గ్రామపటేల్ మెస్రం భీంరావు, మహాజన్ వేర్కడ్ జ్యోతిరాం, మాజీ సర్పంచ్ రాధ మనోహర్, గిరిజనులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి



నువ్వుల రణధీర్ (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. బాదన్‌కూర్తి గ్రామానికి చెందిన నువ్వుల రణధీర్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకుని రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రణధీర్‌ను చికిత్స కోసం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. రణధీర్ సోదరుడు రణవీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కర్రలతో చేపల వేట



ముధోల్: చేపలను సాధారణంగా గాలంతో లేదా వలతో పడుతుంటారు. కానీ, ముధోల్ సమీపంలోని కొలిగల్లీ చెరువులో సుమారు 150 మంది యువకులు ఇలా కర్రలతో వేటాడారు. ఈ చెరువంతా తామర పూల వనం ఉంది. దీంతో దీంట్లో వలలతో చేపలు పట్టడం వీలు కాదు. ఎండలకు చెరువులో నీళ్లు తగ్గిపోవడంతో గురువారం స్థానికులు సుమారు 150 మంది కర్రలు పట్టుకుని ఇలా చేపలవేట సాగించారు. దీంతో చెరువంతా సందడి కనిపించింది. సుమారు 3 క్వింటాళ్ల చేపలు పట్టారు. వాటిని రూ.100కు ఒకటి చొప్పున విక్రయించారు.

భానుడి సెగ... రక్షణ లేకుంటే వ్యధ





జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. దీంతో ఎండల తీవ్రత భగ్గుమంటోంది. భానుడి భగభగల ప్రభావం మనుషులకే కాదు కూరగాయలు, వాహనాలపైనా ప్రభావం చూపిస్తోంది. ఎండ తీవ్రతకు చెడిపోకుండా ఉండాలని కూరగాయల విక్రయదారులు గ్రీన్‌మ్యాట్‌తో కప్పుతుండగా, ద్విచక్రవాహనాలకు తెల్లని వస్త్రాలను కప్పి కాపాడుకుంటున్న ఈ దృశ్యాలు ఆదిలాబాద్ జిల్లాలోని ఎండల తీవ్రతకు అద్దం పడుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్